సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



ఆమనగల్లు: రంజాన్ వేడుకలో చిన్నారులు



మొయినాబాద్: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఆమనగల్లులో..



ఇబ్రహీంపట్నం రూరల్: మంగళ్‌పల్లి ఈద్గా వద్ద చిన్నారుల ఆత్మీయ ఆలింగనం

భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్

రంజాన్ పర్వదినం సందర్భంగా గురువారం జిల్లాలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈద్గాలు, మసీదుల వద్ద సందడి వాతావరణం కనిపించింది. ముస్లింలు భక్తిశ్రద్ధలతో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు. మత గురువులు పండుగ విశిష్టతను వివరించారు.

– సాక్షి, నెట్‌వర్క్

న్యూస్‌రీల్

కేసీఆర్ సభా ఏర్పాట్ల ప్రారంభం



పార్టీ నాయకులతో కలిసి సభ ఏర్పాట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ఫరా ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఈనెల 13న బీఆర్ఎస్ పార్టీ నిర్వహించనున్న బహిరంగ సభా ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం కేసీఆర్ చేపట్టే బస్సు యాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించనున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు. చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేపట్టనున్నట్టు చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఎం. బాల్‌రాజ్, ప్రభాకర్, అనంత్‌రెడ్డి, రాంరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పాపారావు, మోహన్‌రెడ్డి, మహేందర్, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

మరో 4 రోజులే..

ఈనెల 15తో ముగియనున్న ఓటరు నమోదు

- ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల స్వీకరణ
- మే 13న ఎన్నికలు.. ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ మే 13న జరగనుంది. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 15 (సోమవారం) వరకు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఓటేసే అవకాశం ఉంది. ఇప్పటికే బూత్‌స్థాయి అధికారులు(బీఎల్‌ఓలు) తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని పరిశీలించి పేరు లేకుంటే నమోదుకు ఫాం–6 ద్వారా తహసీల్దార్‌కు దరఖాస్తు అందించొచ్చు.

- లోక్‌సభ ఎన్నికల ఓటర్ల అనుబంధ జాబితాను ఈ నెల 25న ప్రకటించనున్నారు. ఫిబ్రవరి 8న తుది జాబితాను వెలువరించిన విషయం విదితమే. ఆ తర్వాతి నుంచి ఈనెల 15 వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హుల పేర్లను ఈ అనుబంధ జాబితాలో ముద్రించనున్నారు.

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఓటర్లు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్లు
మహేశ్వరం	511	5,55,978	2,84,913	2,70,996	69
రాజేంద్రనగర్	535	5,99,585	3,10,863	2,88,684	38
శేరిలింగంపల్లి	622	7,47,673	3,95,460	3,52,069	144
చేవెళ్ల	298	2,69,087	1,35,261	1,33,820	06
పరిగి	269	2,66,273	1,33,625	1,32,639	09
వికారాబాద్	284	2,31,679	1,15,019	1,16,647	13
తాండూరు	269	2,4,3,849	1,18,228	1,25,614	07

- 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే తరహాలో యువ ఓటర్ల నమోదును అధికారులు ప్రోత్సహించారు. నవంబర్ 30న పోలింగ్ నిర్వహించగా, సరిగ్గా నెల రోజుల ముందు వరకు అంటే అక్టోబర్ 31 వరకు ఓటు హక్కు నమోదుకు అవకాశం కల్పించారు. పరిశీలన అనంతరం నవంబర్ 11న ఓటరు తుది జాబితా ప్రకటించారు. గత జాబితాతో పోలిస్తే జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 40 వేల మంది యువ ఓటర్ల సంఖ్య పెరిగింది. ఈసారి కూడా ఏప్రిల్ 15 వరకు 18 ఏళ్లు నిండిన వారందరికీ అవకాశం కల్పించడంతో ఈ సంఖ్య మరింత పెరిగే చాన్స్ ఉంది.
- 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2006 మార్చి 31 లోగా పుట్టిన ప్రతి ఒక్కరూ ఓటరుగా ఫాం–6లో పేరు నమోదు చేసుకోవచ్చు. ఫాం–6తో పాటు వయసు ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో జతపరిచి సంబంధిత బీఎల్‌ఓకు అందించాలి. ఓటరు జాబితాలో పేరు గల్లంతైన వారు, అర్హత ఉండి ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని వారు ఫాం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

వైఎస్ఆర్ తర్వాత కేసీఆరే..

- అలాంటి నాయకుడు దొరకడు
- మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: కేసీఆర్‌లాంటి నాయకుడు దొరకడని, ఆయన నాయకత్వంలో పని చేయడం ఎంతో గర్వంగా ఉందని.. ప్రజలకు పని చేయాలనే తపన వైఎస్ఆర్ తర్వాత కేసీఆర్‌లోనే చూశానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం మండల సమీపంలోని అంజయ్య గార్డెన్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ హయాంలోనే 96 కులాలను ఏకతాటిపైకి తెచ్చి వారికి అండగా నిలబడ్డ చరిత్ర కాసానిదన్నారు. రంజిత్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత పార్టీ మారడం అవమానించడమేనన్నారు. కేసీఆర్ పాలనను కాంగ్రెస్ 90 రోజుల పాలనతో బేరీజు వేసుకోవాలన్నారు. లోక్‌సభలో తెలంగాణ వాణిని వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించాలన్నారు. చేవెళ్లలో ఈ నెల 13న కేసీఆర్ పాల్గొననున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎ.అంజయ్యగౌడ్, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, పార్టీ మహిళా అధ్యక్షురాలు టి.ఇందర, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీటీసీలు కాకి రాములు, రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు పి.ఆనంద్, పాండురంగారెడ్డి, సీనియర్ నాయకులు కాకి దశరథ, పర్వతాలు, పరంజ్యోతి, సామయ్య, ప్రకాష్‌రెడ్డి, దేవీలాల్, జంగయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రతి ఇంట్లోనూ ఏసీలు, గీజర్లు, వాషింగ్ మిషన్లు
- గిర్రున తిరుగుతున్న మీటర్లు.. ఒత్తిడిలో సబ్‌స్టేషన్లు



‘పవర్’ దూకుడు



10 ఏళ్లలో ఈసారి ఆల్‌టైమ్ రికార్డు..

2014 జూన్‌లో 49.56 మిలియన్ యూనిట్లు

2024 ఏప్రిల్ 8న 84.75 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం

గ్రేటర్‌లో డబుల్ కరెంట్ వాడకం.. ముున్ముందు మరింత పెరిగే అవకాశం

నోముల శ్రీశైలం

ఏసీలో కూర్చొంటే ఎవరికైనా వణుకు పుట్టాలి కానీ..నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ వినియోగం చూస్తే విద్యుత్ ఇంజనీర్లకు ముచ్చెమటలు పడుతున్నాయి. కొత్త విద్యుత్ కనెక్షన్లకు తోడు పగటి ఉష్ణోగ్రతలు రెట్టింపు అవుతుండటంతో విద్యుత్ వినియోగం కూడా అదే స్థాయిలో రికార్డు అవుతోంది. ఫిబ్రవరిలో సగటు విద్యుత్ వినియోగం 55 ఎంయూలు (మిలియన్ యూనిట్లు) ఉండగా, మార్చి నాటికి 75 ఎంయూలు దాటింది. ఏప్రిల్‌లో 82 నుంచి 84 ఎంయూలు నమోదవుతోంది. మే నాటికి 90 ఎంయూలకు చేరే అవకాశం ఉంది. ఒత్తిడిని తట్టుకునేందుకు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నప్పటికీ.. మెజార్టీ సెక్షన్ల పరిధిలో ఇప్పటికీ సాంకేతిక సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి.



నగరం శరవేగంగా విస్తరిస్తోంది. కోర్‌సిటీతో పాటు శివారు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గృహ, వాణిజ్య, పారిశ్రామిక భవనాలు వెలుస్తున్నాయి. నెలకు సగటున 2500–3000 వరకు కొత్త కనెక్షన్లు వచ్చి చేరుతున్నాయి. ఫలితంగా ఏటా విద్యుత్ వినియోగం రెండు నుంచి మూడు శాతం అధికంగా నమోదవుతున్నట్లు అంచనా. రోజురోజుకూ పుట్టుకొస్తున్న కొత్త కనెక్షన్లకు తోడు విద్యుత్ గృహోపకరణాల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. ఒకప్పుడు ధనవంతుల ఇళ్లలో మాత్రమే కనిపించిన ఏసీలు, గీజర్లు, రిఫ్రిజిరేటర్లు, కంప్యూటర్లు.. ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ సర్వసాధారణమయ్యాయి. ప్రస్తుతం ఎండలు భగ్గున మండుతున్నాయి. ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు రోజంతా ఆన్ చేసి ఉంచుతున్నారు. మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. ఫలితంగా గ్రేటర్ జిల్లాల్లో విద్యుత్ డిమాండ్ పీక్ స్థాయికి చేరుకుంది.

తలసరిలోనూ టాప్

- 2006లో 24.12 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. 1,538 మెగావాట్ల డిమాండ్ నమోదయ్యేది. ఇక 2014 నాటికి వీటి సంఖ్య 38 లక్షలకు చేరుకుంది. విద్యుత్ డిమాండ్ కూడా అదే స్థాయిలో 2,200 మెగావాట్లకు చేరింది.
- 2019 నాటికి 50 లక్షలకు చేరగా, డిమాండ్ 3,250 మెగావాట్లకు చేరింది. తాజాగా 3,819 మెగావాట్లకు చేరడం గమనార్హం. 2021లో 53,95,903 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, ప్రస్తుతం వీటి సంఖ్య 61 లక్షలు దాటింది. ఏటా పెరుగుతున్న కనెక్షన్లతో పాటు డిమాండ్ కూడా భారీగా నమోదవుతోంది.
- పారిశ్రామిక వినియోగంతో పోలిస్తే గృహ వినియోగమే రెట్టింపైంది. అంతేకాదు 2014లో వేసవి పీక్ డిమాండ్ 2,261 మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం 3,819 మెగా వాట్లకు చేరుకోవడమే ఇందుకు నిదర్శనం. అంతేకాదు.. సగటు కరెంట్ వినియోగంలోనూ భారీ తేడాలు నమోదవుతుండటం గమనార్హం. 2014లో తలసరి విద్యుత్ వినియోగం 1,356 యూనిట్లు ఉండగా, ప్రస్తుతం 2,261 యూనిట్లకు చేరింది.

డిమాండ్ పెరిగింది

ఏసీలు..గీజర్లు..ఓవెన్‌లు..వాషింగ్ మిషన్లు..రిఫ్రిజిరేటర్లు.. ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ సర్వసాధారణమయ్యాయి. దీంతో పారిశ్రామిక, వాణిజ్య వినియోగంతో పాటు గృహ విద్యుత్ వినియోగం కూడా రెట్టింపైంది. కోర్ సిటీతో పోలిస్తే..రంగారెడ్డి జోన్ పరిధిలోని సైబర్ సిటీ, సరూర్‌నగర్, రాజేంద్రనగర్, మేడ్చల్, హబ్సిగూడ సర్కిళ్ల పరిధిలోనే డిమాండ్ పీక్ స్టేజీకి చేరుకుంటుంది. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లలోని పీటీఆర్‌లు, డీటీఆర్‌ల సామర్థ్యం పెంచుతున్నాం. అంతరాయాలకు ఆస్కారం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

– పి.ఆనంద్, సీజీఎం, రంగారెడ్డి జోన్

విద్యుత్ కనెక్షన్లు ఇలా..

	2021	2022	2023
గృహ	44,26,472	46,28,067	50,99,190
వాణిజ్య	7,31,441	7,61,938	8,22,821
పారిశ్రామిక	35,283	35,419	36,440
ఇతర కనెక్షన్లు	2,02,707	2,11,020	1,82,344
మొత్తం	53,95,903	56,36,444	61,40,795

గ్రేటర్ జిల్లాల్లో విద్యుత్ వినియోగం ఇలా...

అంశం	2014	2024
తలసరి వినియోగం	1356 యూనిట్లు	2261 యూనిట్లు
విద్యుత్ కనెక్షన్లు	38,16,211	61,40,795
400 కేవీ సబ్‌స్టేషన్లు	02	04
220కేవీ సబ్‌స్టేషన్లు	10	22
33/11కేవీ సబ్‌స్టేషన్లు	337	480
డీటీఆర్‌లు	84,491	1,47,192

బిల్లు పెరిగినా.. తప్పనిసరి

ఎండలు భగ్గున మండుతున్నాయి. వేసవిలో ఏసీ, చలికాలంలో వేడినీటి కోసం గ్రీజర్ వాడకం తప్పడం లేదు. ఇక ఇంట్లో వాషింగ్ మిషన్, రిఫ్రిజిరేటర్, కంప్యూటర్, టీవీ, ఐరన్ బాక్స్, ఫ్యాన్లు, లైట్లు వినియోగం సాధారణమైంది. సంపులోని నీరు ఇంటిపై ఉన్న ట్యాంకుల్లోకి ఎక్కించాలంటే బోరు మోటార్ ఆన్ చేయాల్సిందే. గతంతో పోలిస్తే కరెంట్ వినియోగం రెట్టింపైంది. నెలవారీ విద్యుత్ బిల్లు కూడా అదే స్థాయిలో పెరిగింది. నెలకు సగటున రూ. 5వేలకుపైగా బిల్లు చెల్లిస్తున్నా. అయినా తప్పడం లేదు.

– గుర్రం చంద్రశేఖర్, హస్తినాపురం

క్షణం కూడా ఉండలేని పరిస్థితి

ఒకప్పుడు ధనవంతుల ఇళ్లల్లో మాత్రమే ఏసీ, వాషింగ్ మిషన్, గ్రీజర్లు కన్పించేవి. ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ తప్పనిసరి అయ్యాయి. ఎలక్ట్రానిక్ వస్తువులపై పలు బ్యాంకులు లోన్లు కూడా ఇస్తుండటం, కంపెనీలు ఆఫర్లు ప్రకటిస్తుండటంతో అనివార్యం కాకపోయినా వాటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. నిమిషం పాటు కరెంట్ లేకపోతే ఉండలేని పరిస్థితి నెలకొంది. పదేళ్ల క్రితం నెలకు రూ.500 లోపు వచ్చే విద్యుత్ బిల్లు.. ఇప్పుడు రూ.3500కుపైగా వస్తోంది.

– పోలోజు రవీంద్రాచారి, జిల్లెలగూడ

ఆ పార్టీలను ఓడించాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చేరుపల్లి సీతారాములు



సమావేశంలో పాల్గొన్న పార్టీ నేతలు

మంచాల: ప్రజాస్వామ్య పాలన రావాలంటే బూర్జువా పార్టీలను ఓడించి, సీపీఎం బలపర్చిన భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చేరుపల్లి సీతారాములు అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పాలన చూశామని.. పేదోడి పొట్ట కొట్టి ఉన్నోడికి కట్టబెట్టాయని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో స్కాంలు చేశారని ఆరోపించారు. పాలకుల జీవితాల్లో మార్పులు వచ్చాయి తప్ప ప్రజల్లో మాత్రం మార్పు రాలేదన్నారు. కార్పొరేట్ విధానాలను పెంచి పోషించి పేదోడికి నాణ్యమైన విద్య, వైద్యం అందకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. బడా పెట్టుబడిదారులు, దోపిడీ దారులకు కొమ్ముకాసే ప్రభుత్వాలను కూలదోయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లయినా పేదల జీవితాల్లో మార్పు రాలేదంటే పాలకుల తీరే నిదర్శమన్నారు. ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిషలు కృషి చేసే పార్టీ సీపీఎం అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.యాదయ్య, నాయకులు వెంకట్ రాములు, శ్రీరాంనాయక్, శ్యాంసుందర్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, రాజు, స్వామి, మమత తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: పోటీలతో క్రీడాకారుల నైపుణ్యాలను వెలికితీయవచ్చునని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో మల్లి అంజయ్య జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడా పోటీతో గ్రామాల మధ్య స్నేహ సంబధాలు పెరుగుతాయన్నారు. గెలుపోటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు మహేశ్, వెంకటేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రాంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి

వృద్ధురాలి బలవన్మరణం

తలకొండపల్లి: కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాదకర ఘటన మండల పరిధిలోని చీపునుంతలలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మల్తాకార్ నర్సమ్మ(60) కుటుంబం కొన్ని రోజులుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. దీంతో విరక్తి చెందిన ఆమె బుధవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి సాయంత్రమైన తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తెలిసిన వారందరిని విచారించారు. మిత్రులు, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం ఉదయం గ్రామ శివారులలోని బావి వద్ద అటుగా వెళుతున్న కొందరికి చెప్పులు కనపడడంతో అనుమానంతో బావిలో గాలించగా నర్సమ్మ శవం లభ్యమైంది. కూతురు అమృత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, భర్త ఆరేళ్ల క్రితం మృతి చెందాడు. మృతురాలి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.


నర్సమ్మ మృతదేహం

నల్లమందు విక్రయిస్తున్న వ్యక్తికి రిమాండ్

మీర్‌పేట: నిషేధిత నల్లమందు విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం మీర్‌పేట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన అగ్రీవత్ సంతోశ్‌దాస్(38), బుద్దారామ్ స్నేహితులు. లెనిన్‌నగర్ కాలనీలో ప్రశాంత్‌నగర్‌లో నివసిస్తూ కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రాజస్థాన్‌లో నల్లమందును తక్కువ ధరకు కొనుగోలు చేసి నగరంలో విక్రయించాలని నిర్ణయించుకున్నా రు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసు లు బుధవారం ఎస్ఓటీ పోలీసులతో కలిసి రాత్రి అ గ్రీవత్ సంతోశ్‌దాసును అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 1.5కేజీల నల్లమందును స్వాధీనం చేసు కుని గురువారం రిమాండ్ రిమాండ్‌కు తరలించా రు. బుద్దారామ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం

పహాడీషరీఫ్: బాలాపూర్ ఠాణా పరిధిలో యువతి అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. గురువారం సీఐ భూపతి వివరాలు వెల్లడించారు. షాహీనగర్‌కు చెందిన షేక్ జహంగీర్ కుమార్తె సనాబేగం(15) ఈ నెల 10న ఉదయం 9గంటలకు ఇంట్లో రూ.15వేల నగదుతో బయటికి వెళ్లింది. గమనించిన కుటంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభ్యమవ్వలేదు. దీంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62366 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.


సనా బేగం (ఫైల్)

మూడోసారి మోదీ పక్కా

బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి

మొయినాబాద్: మూడోసారి మోదీని పక్కా ప్రధానిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా గురువారం మండలంలోని వెంకటాపూర్‌లో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని రక్షించుకోవాలంటే మళ్లీ మోదీనే ప్రధాని కావాలన్నారు. అందుకోసం ప్రజలంతా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలన్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి తనను గెలిపిస్తే దేశంలో మోదీ బలం మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, సనివెల్లి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు గున్నాల గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, రాజమల్లేష్, రాజుగౌడ్, సుధాకర్‌రెడ్డి, యాదయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచకట్టుతో...

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజా ఆశీర్వాద యాత్ర చేపడుతున్న కొండా విశ్వేశ్వరరెడ్డి పంచకట్టుతో ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. గురువారం ప్రజా ఆశీర్వాద యాత్రలో పంచకట్టుతో గ్రామాల్లో పర్యటించారు. నాలుగు రోజుల క్రితం మండలంలో జరిగిన బూత్ అధ్యక్షుల సమావేశంలోనూ ఆయన పంచకట్టుతో పాల్గొన్నారు. పంచకట్టుతో గ్రామీణ ప్రాంత ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు.


వెంకటాపూర్‌లో పర్యటిస్తున్న కొండా విశ్వేశ్వరరెడ్డి

మోదీతోనే సమగ్ర అభివృద్ధి

మొయినాబాద్‌రూరల్: ప్రధాని మోదీతోనే దేశంలో సమగ్ర అభివృద్ధి జరిగిందని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర గురువారం నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో పర్యటిస్తూ మహిళలు, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మోదీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని బీఆర్ఎస్, ఇతర పార్టీల యువకులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సనివెల్లి ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, మండల ఓబీసీ అధ్యక్షులు అశోక్‌యాదవ్, మహేందర్ ముదిరాజ్, భీమేందర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, యువమోర్చా మండల అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, మాజీ సర్పంచ్ మోత్కుపల్లి రత్నం తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లగడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం

చేవెళ్ల: ఈసారి చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా గురువారం మండలంలోని పామెన, కందవాడ, పలుగట్ట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామాల్లో గుర్తించిన అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మండల నాయకులు పాండురంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, శర్వలింగం, వెంకట్‌రాంరెడ్డి, కృష్ణగౌడ్, శ్రీపాల్‌రెడ్డి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బురద నీటికి జలమండలి చెక్

బండ్లగూడ: నగర శివార్లలోని హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలు గ్రేటర్ వాసుల దాహార్తి తీర్చడంలో కీలకంగా మారాయి. వేసవిలో తాగునీటి కొరత రాకుండా జలమండలి అధికారులు చర్యలు చేపట్టారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ జలాశయం అడుగు భాగంలో నాచుతో కూడిన బురదనీరు పేరుకుపోయింది. దీంతో మీరాలం వాటర్ ఫిల్టర్ కేంద్రానికి బురదనీరు రావడంతో 10 అడుగుల పైనుంచి నీటిని తీసుకోవడానికి జలమండలి అధికారులు మూడు భారీ క్రేన్ల సహాయంతో రెండు పంపింగ్ మోటార్లను ఏర్పాటు చేశారు. రూ.60 లక్షల వ్యయంతో 300 హెచ్‌పీ సామర్థ్యమున్న రెండు పంపింగ్ మోటార్లతో జలాశయంలోని కింది భాగంలోని పోరుబావిలో నీరుచేరేలా ట్రయల్ కూడా నిర్వహించినట్లు ఏజీఎం డేవిడ్ రాజ్ తెలిపారు.


హిమాయత్‌సాగర్‌లో ఏర్పాటు చేసిన మోటార్లు

'అలనాటి సినీ రంగస్థల ప్రముఖులు' పుస్తకావిష్కరణ

ఉమ్మడి హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

హస్తినాపురం: సోషల్‌మీడియా, టెక్నాలజీ పెరుగుతున్న దశలో రంగస్థల, సినీ మాధ్యమాలు క్లిష్ట పరిస్థితిలో ఉన్నాయని ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. గురువారం సాగర్‌రోడ్డులోని హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీ హాల్ లో ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'ఆకృతి' ఆధ్వర్యంలో కే.సూరిబాబు రచించిన అలనాటి సినీ రంగస్థల నటులు గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలతో రచయిత సూరిబాబు దాదాపు రెండు వందల మంది ప్రముఖుల సంగ్రహ చరిత్రను పుస్తకరూపంలో తేవడం అభినందనీయమన్నారు. ఆయా నటుల జీవిత విశేషాలే కాకుండా వారి పట్టుదల నిరంతర కృషి మానవతా విలువలు కూడా ఆయన రచనలో కనిపిస్తాయన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ సినీ రంగస్థల నటుడు మల్లాదిరాఘవ మాట్లాడుతూ ఎలాగైతే నాటకాన్ని సినిమా ప్రభావితం చేసిందో ఇప్పుడు సినిమా రంగం ఓటీటీలు, సోషల్ మీడియా, ప్రభావంతో కుదేలవుతుందన్నారు. ఇలాంటి రచనల వల్ల నాటకాలకు సినిమాలకు పునర్జీవం కలుగుతుందన్నారు. ప్రముఖ సినీ కవి దర్శకుడు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ పుస్తక సమీక్ష నిర్వహించారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు పుస్తక అభిమానులు పాల్గొన్నారు. అంతకు ముందు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వరరాజు సభకు స్వాగతం పలికారు.

పూలే అవార్డుల ప్రదానం

రాజేంద్రనగర్: బుద్వేల్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్‌కు మహాత్మా జ్యోతిరావు పూలే అవా ర్డు వరించింది. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో గురువారం రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న బీసీలకు అవార్డులు అందించారు. కేంద్ర బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సాయి మల్లిక్ మాట్లాడుతూ తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు అందించడం ఆనందంగా ఉందన్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్‌లు స్వాధీనం

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ పరిధిలోని పలు చోట్ల చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని వాటిని బాధితులకు అందజేసినట్లు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ డీఐ రామిరెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా 11 మంది ఫోన్‌లు చోరీకి గురైనట్లు, వాటిని సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో స్వాధీనం చేసుకున్న ట్లు డీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఫోన్‌లను గురువారం బాధితులకు అందజేశామన్నారు.


స్వాధీనం చేసుకున్న ఫోన్‌లను బాధితులకు అందజేస్తున్న డీఐ రామిరెడ్డి

బీజేపీ ఎండోమెంట్ సెల్ సభ్యుడిగా వెంకట్‌రాంరెడ్డి

చేవెళ్ల: బీజేపీ ఎండోమెంట్ సెల్ (ధార్మిక పరిషత్) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మండలంలోని పలుగుట్ట గ్రామానికి చెందిన కె. వెంకట్‌రాంరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ తనకు నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని పేర్కొన్నారు. సహచర కార్యకర్తలు, పార్టీ ఇతర కమిటీలతో కలిసి అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎండోమెంట్‌సెల్ స్టేట్ కన్వీనర్ సూర్యప్రకాశ్, కో కన్వీనర్ నింజన్ దేశాయి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు తెలిపారు.


నియామకపత్రం అందజేమాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

యాచకుడి మృతి

- మైలార్‌దేవ్‌పల్లిలో జీరో ఎఫ్ఐఆర్
- పహాడీషరీఫ్‌కు కేసు బదిలీ

పహాడీషరీఫ్: గుర్తు తెలి యని వ్యక్తి మృతదేహానికి సంబంధించి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన జీరో ఎఫ్ఐఆర్ కేసు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీ సరిహద్దులోని ఎర్రకుంట పక్కన ఈ నెల 3న సుమారు 35 ఏళ్ల వయసున్న యువకుడు వస్త్రాలు లేకుండా పడిపోయి ఉండడంపై సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. అప్పటికే మృతి చెందడంతో వారు ఈ ఘటనపై జీరో ఎఫ్ఐర్ నమోదు చేశారు. మృతదేహం పడి ఉన్న స్థలం పహాడీషరీఫ్ పరిధి కావడంతో గురువారం ఇక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా యువకుడు ఈ నెల 2న కింద పడి మృతి చెందినట్లుగా తెలిపారు. యాచక వృత్తి కొనసాగించే అతని సంబంధీకులెవరైనా ఉంటే తమను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.


యాచకుడి మృతదేహం (ఫైల్)

ఒకే దొంగ.. ఒకటే కాలనీ

- గంట వ్యవధిలో మూడు ఇళ్లలో చోరీ
- ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు తస్కరణ

ఇబ్రహీంపట్నం రూరల్: ఒకే కాలనీలో.. ఒకడే దుండగుడు మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడ ఎస్ఎస్ఆర్ నగర్‌లో సామల ప్రభాకర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి స్లాబ్‌పై నిద్రించారు. రాత్రి రెండు గంటల సమయంలో ఆయన సతీమణి బాత్‌రూంకు వెళ్తుండగా తలుపులు తెరిచి ఉయన్నాయి. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా పగలగొట్టి బట్టలు చిందరవందరగా పడిఉన్నాయి. ఆమె వెంటనే భర్తను పిలిచి చెప్పగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అంతకు ముందు కాలనీలో మరో రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. ఏమి దొరక్క వెనుదిరిగాడు. వస్తువులను చిందరవందరగా పడవేశాడు. గంట వ్యవధిలోనే మూడు ఇళ్లలో దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఒకే వ్యక్తి బైక్ వచ్చి చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.


వివరాలు సేకరిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

చల్లబడ్డ నగరం.. తగ్గిన వేసవి తాపం

సాక్షి, సిటీబ్యూరో: నిన్న వరకు నిప్పులు కురిపించిన సూర్యుడు గురువారం కొంత చల్లబడ్డాడు. పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో పాటు సాయంత్రం ఆకాశంలో మబ్బులు అలముకున్నాయి. భగ్గున మండిన ఎండలకు ఉక్కపోత తోడవడంతో ఉక్కిరి బిక్కిరికి గురైన నగర వాసులు తాజాగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం 40.8 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, బుధవారం 40 డిగ్రీలు నమోదైంది. తాజాగా గురువారం టోలిచౌకిలో అత్యధికంగా 39.3 సెల్సియస్ డిగ్రీలు, ఫలక్‌నుమాలో అత్యల్పంగా 35.5 డిగ్రీలు నమోదైంది. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో 39.8 డిగ్రీలు, మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 38.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం విశేషం. ఇదిలా ఉండగా గ్రేటర్‌లో పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడం, రాత్రి చలిగాలులు వీస్తుండటంతో కరెంట్ వినియోగంలోనూ భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. ఏప్రిల్ 8న అత్యధికంగా 3914 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు కాగా, బుధవారం 3492 మెగావాట్లకు తగ్గింది. ఇక తాజాగా గురువారం 3207 మెగావాట్లకు పడిపోవడం గమనార్హం. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులే ఇందుకు కారణం.

పది తాగునీటి సరఫరా కేంద్రాల ఏర్పాటు

రాజేంద్రనగర్: జలమండలి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 10 ఉచిత మంచినీటి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రాజేంద్రనగర్ బుద్వేల్ సెక్షన్ జలమండలి మేనేజర్ రామ్ నర్సింహా రెడ్డి తెలిపారు. గురువారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రయాణికులు, విద్యార్థులు ప్రజల సౌకర్యార్థం తాగునీరు అందించాలనే ఉద్దేశంతోనే అత్తాపూర్, హైదర్‌గూడ, ఆరాంఘర్, ఉప్పర్‌పల్లి బస్టాండ్లతో పాటు సులేమాన్‌నగర్, పీడీపీ చౌరస్తాల్లో వీటిని ఏర్పాటు చేశామన్నారు.

మంగోలియన్ మెట్రో రైల్‌కు హెచ్‌ఎంఆర్ మార్గనిర్దేశం

- నగరాన్ని సందర్శించిన మంగోలియన్ ప్రభుత్వ ప్రతినిధులు
- పీపీపీ పద్ధతిలో మెట్రో నిర్మాణానికి చట్టపరమైన, సాంకేతిక సహకారం
- హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: మంగోలియన్ ప్రభుత్వ ప్రతినిధుల బృందం గురువారం నగరాన్ని సందర్శించింది. మంగోలియా రాజధాని ఉలాన్ బాటర్‌లో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో నిర్మించ తలపెట్టిన మెట్రో రైల్ ప్రాజెక్టుపై అధ్యయనం కోసం వారు హైదరాబాద్‌కు వచ్చారు. మంగోలియా ప్రభుత్వ కేబినెట్ సెక్రెటేరియట్ పురేవ్‌సురన్ సరంగేరల్ నేతృత్వంలో వివిధ విభాగాలకు చెందిన 20 మంది అధికారులు నగరాన్ని సందర్శించారు. మొదట ఖైరతాబాద్‌లోని ఆస్కీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు బేగంపేట్‌లోని హైదరాబాద్ మెట్రో రైల్ భవన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి మంగోలియన్ అధికారుల బృందంతో సమావేశమయ్యారు. పీపీపీ పద్ధతిలో నిర్మించిన హైదరాబాద్ మెట్రో రైల్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రాజెక్ట్ అని చెప్పారు. మెట్రోరైల్ నిర్మాణంలో ఎదురయ్యే చట్టపరమైన, సాంకేతికపరమైన సమస్యలపైన వారికి వివరించారు. వివిధ దశల్లో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపైన ఎన్వీఎస్ ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు అంశాలపైన మంగోలియా అధికారులు వ్యక్తం చేసిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. అనంతరం తాము పీపీపీ పద్ధతిలో చేపట్టాలని భావిస్తున్న మెట్రో రైల్ నిర్మాణానికి చక్కటి గైడెన్స్ లభించాయని మంగోలియన్ ప్రభుత్వ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే మంగోలియన్ ప్రభుత్వం నిర్మించనున్న మెట్రో రైల్ ప్రాజెక్టుకు మార్గదర్శనం చేయనున్నట్లు ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఆస్కీ సీనియర్ అధికారులు ప్రొఫెసర్ సుబోధ్, శ్రీదేవి పాల్గొన్నారు.


మెట్రో ఎంపీ ఎన్వీఎస్‌రెడ్డితో పొట్లాడుతున్న మంగోలియన్ ప్రభుత్వ ప్రతినిధులు